# మొదటి పాఠం

# الدرس الأول

## భూమిక

## تمهيد

మనిషి, తను జీవిస్తున్న ఈ భూమి, సుందర విశాలమైన ఈ విశ్వం, ఆశ్చర్యంలో పడవేసే లెక్కలేనన్ని నక్షత్రాలతో నిండియున్న ఆకాశాన్ని గమనిస్తే, అంతయూ పటిష్ఠమైన వ్యవస్థతో నడుస్తున్నదిగా గమనిస్తాడు. అంతే కాదు భూమి, అందులో ఉన్న పర్వతాలు, లోయలు, సెలయేర్లు, వృక్షాలు, గాలి, నీరు, సముద్రాలు, ఎడారులు మరియు రేయింబవళ్ళనిటిని గమనిస్తే **వీటన్నిటిని సృష్టించినవాడెవడూ**? అనే ప్రశ్న తప్పకుండా తలెత్తుతుంది.

నీరు లేనిదే జీవితం శూన్యం, దీనిని ఆకాశం నుండి కుర్పించేదెవరు? దాని ద్వారా పంటలు, చెట్లు, పుష్పాలు, ఫలాలు వెలికి తీసేవాడెవడు? మనుషులకు, పశువులకు దానిని ఉపయోగకరమైనదిగా చేసేవాడెవడు? నీరును తన గర్భంలో భద్రపరిచే శక్తి భూమికిచ్చిందెవరు?

ప్రతి వస్తువును అవసరమున్నంత పరిమాణంలో మాత్రమే ఆకర్షించుకునే శక్తి భూమికి ఇచ్చిందెవరు? అవసరానికి మించి ఆకర్షించదు, చలనమే కష్టం అవుతుంది గనక. అవసరానికంటే తక్కువ ఆకర్షించదు, లేదంటే ప్రతి వస్తువు ఈదుతూ ఉంటుంది.

మనిషిని అందమైన ఆకారంలో సృష్టించేవాడెవడు?

అంతెందుకూ! మనిషి స్వయం తన ఆకృతి గురించి గమనిస్తే ఆశ్చర్యపోతాడు. నీ శరీరములో ఉన్న వివిధ అవయవాలపై ఒకసారి దృష్టి సారించు, ఒక నిర్దిష్టమైన పద్దతిలో అవి పని చేస్తున్నాయి. వాటి పని విధానం గురించి నీకు తెలిసినది చాలా తక్కువ. అలాంటప్పుడు దాని గురించి ఖచ్చితమైన నిర్ణయం ఎలా చేయగలవు?

నీవు పీల్చుతున్న ఈ గాలిని గమనించు! అది ఒక క్షణమైనా ఆగితే నీ జీవితమే అంతమవుతుంది. అయితే దాన్ని ఉనికిలోకి తెచ్చిందెవరు?

నీవు త్రాగుతున్న నీరు, నీవు తింటున్న ఆహారం, నీవు నడుస్తున్న ఈ నేల, నీకు వెలుతురునిస్తున్న సూర్యుడు, ఇంకా నీవు తిలకిస్తున్న ఆకాశ చంద్రతారలన్నింటిని సృష్టించినవాడెవడు? **అల్లాహ్. నిశ్చయంగా అల్లాహ్ యే.**

అవును, అల్లాహ్ యే ఈ జగమంతటినీ సృష్టించాడు. ఆయన ఒక్కడే దాన్ని నడుపుతున్నాడు. అందులో మార్పులు చేస్తున్నాడు.

ఆయనే నీ ప్రభువు, నిన్ను సృష్టించినవాడు, పోషించేవాడు, బ్రతికించినవాడు, మరణం ప్రసాదించేవాడు. ఆయనే నిన్ను శూన్యం నుండి ఉనికిలోకి తీసుకొచ్చాడు ఎలాగైతే ఈలోకాన్ని శూన్యం నుండి ఉనికిలోకి తెచ్చాడో.

ఇదంతా తెలిసాక, ఏ జ్ఞానవంతుడైనా 'ఈ లోకమంతా వృధాగా పుట్టించబడిందని, మనుషులు పుడుతారు, కొంత కాలం జీవించి చనిపోతారని, ఇలా అంతా సమాప్తమయి పోతుందని' అనగలడా?

అయితే వాస్తవం ఏమిటి? **మనమెందుకు పుట్టించబడ్డాము?**

దీని సమాధానం ఏమిటంటే: అల్లాహ్ మనల్ని పుట్టించింది కేవలం ఆయన్ను ఆరాధించడానికే, ఆయన్ని తప్ప మరొకరిని కాదు. ఆయన్ని ఆరాధించే విధానం తెలియజేయడానికే ప్రవక్తల్ని పంపాడు, గ్రంథాల్ని అవతరింపజేశాడు. ఎవరయితే ఆయన్నే ఆరాధించి, ఆయనకు విధేయులుగా ఉండి, ఆయన వారించిన వాటి నుండి దూరంగా ఉంటాడో అతడే ఆయన (అల్లాహ్) ప్రసన్నత పొందినవాడు. మరెవరయితే ఆయన ఆరాధన నుండి విముఖుడై, ఆయన విధేయతను నిరాకరిస్తాడో అతడే ఆయన ఆగ్రహానికి, శిక్షకు గురైనవాడు.

అల్లాహ్ ఈ లోకంలో మానవులను ఆచరణ మరియు పరీక్ష కొరకు పుట్టించాడు. ప్రళయదినాన లెక్క, తీర్పు, ప్రతిఫలం కొరకు వారందరిని మళ్ళీ బ్రతికిస్తాడు. అల్లాహ్ ఆయన ఆజ్ఞా పాలన చేసినవారి కొరకు అక్కడ వివిధ వరాలతో కూడి ఉన్న స్వర్గాన్ని సిద్ధపరిచాడు. దానిని ఏ కన్నూ చూడలేదు. ఏ చెవీ వినలేదు. ఎవరి ఊహలకూ అందలేదు.

అలాగే అల్లాహ్ ను తిరస్కరించి, ఇతరుల్ని పూజించే వారి కొరకు మానవులు ఊహించని రకరకాల శిక్షలతో కూడిన నరకాగ్నిని తయారు చేశాడు.

**ఇస్లాం అంటేమిటి?**

అల్లాహ్ ఇష్టపడిన ధర్మం, సర్వ మానవాళి కొరకు పంపిన ధర్మం ఇస్లాం. అనగా అద్వితీయుడైన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించుట మరియు అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క విధేయతను పాటించుట. ఏ వ్యక్తి అయినా సరే ఇస్లాం తప్ప ఇతర ధర్మాన్ని అవలంభిస్తే దాన్ని అల్లాహ్ ఎన్నటికీ స్వీకరించడు. ఇది మానవ సమాజంలో ఏదో కొందరిది కాదు, సర్వ మానవులకు చెందినది.

అల్లాహ్ మానవులకు కొన్ని ఆదేశాలిచ్చాడు, మరికొన్ని విషయాలను నిషేధించాడు. ఎవరైతే ఇందులో అల్లాహ్ కు విధేయత చూపుతాడో అతడు సాఫల్యం మరియు నరకం నుండి రక్షణ పొందుతాడు. ఎవరైతే అవిధేయత చూపుతాడో అతడు విఫలుడౌతాడు మరియు నష్టపోతాడు.

**ఇస్లాం కొత్త ధర్మం కాదు. ఈ భూమిపై మానవ ఆరంభం నుండీ అల్లాహ్ వారి కొరకు ఇష్టపడిన ధర్మం ఇస్లాం. ప్రవక్తలందరూ తమ జాతివారికి ఆహ్వానించినది ఈ ఇస్లాం ధర్మం వైపునకే.**